# అనగనగా... ఒక కథ

డాక్టర్ శంకరరావు కారు డ్రైవ్ చేస్తున్నాడు. 'నాన్నకి మరీ తాపత్రయం. చాదస్తం కాకపోతే ఐదారువేల రూపాయల విలువ కూడా చెయ్యని పల్లెటూళ్ళోని ఇళ్ళస్థలాన్ని అమ్మేసి డబ్బు తెచ్చేయాలని పట్టుదల ఎందుకో' అనుకొంటున్నాడు. వయసు పెరిగితే మమకారం పెరుగుతుందేమో? 'మన సొమ్ము మనం కాపాడుకోవాలి. లక్ష్యం ఉంటేనే లక్ష్మి ఉంటుంది' అని క్లాసుపీకి పంపిస్తున్నాడు.

## పితృఋణం

'రెండొందల కిలోమీటర్లు కార్లో వెళ్తే తనకీ, పెట్రోలుకో రెండు వేలు ఖర్చు అవదూ? రెండు పూటల పనిపోతే తనకెంత లాసో ఆయనకి ఎంత చెప్పినా అర్థం అవ్వదు' అనుకుంటూ...కారు వేగాన్ని పెంచాడు.

నిజమే. సిటీలో టాప్ న్యూరోసర్జన్ శంకరరావు ఐదారు మల్టీ స్పెషాల్టీ హాస్పిటల్స్‌కి కన్సల్టింగ్ డాక్టరూ, సర్జనూ. అతను ఒక్కో రోజు నాలుగైదు ఆపరేషన్లు లాగించేస్తాడు. ఆదాయం చెప్పక్కర్లేదు. అంత పనీ అంత మనీ వదులుకుని ఈ రోజు ఈ ప్రయాణం పెట్టుకున్నాడు. కేవలం తండ్రి పోరుపడలేక అనటం కన్నా బాధ చూడలేక అనడం సమంజసం. అతనికి నాన్నమీద గౌరవం ఉండటం కూడా ఓ కారణం. పెద్దాయన ఎంత కష్టపడి ఆ ఇళ్ల స్థలం కొన్నాడో శంకరం ఊహించగలడు. ఊహించక్కర్లేకుండానే చాలాసార్లు కొడుకుతో చెప్పాడు. ఆ స్థలంలో ఓ ఇల్లు కట్టుకోవాలని చాలా ప్రయత్నం చేశాడు శంకర్రావు తండ్రి.

కానీ...కాణీ అణా కూడబెడితే గాని కొడుకుని విదేశాల్దాకా పంపించి చదివించలేకపోయాడు. ఇంక ఇల్లెలా కడతాడు?

కొడుకు చదువైపోవస్తూనే విజయవాడలో ప్రాక్టీసు పెడుతూ ఆ ఊరు డాక్టరమ్మాయినే పెళ్లి చేసుకున్నాడు. తల్లీ తండ్రిని తనతో ఉండటానికి రమ్మని వేధించుకుతిన్నాడు. సరే. వాడి ముచ్చట ఎందుకు కాదనాలి అని మూటాముల్లె సర్దుకొని ఇంద్రభవనం లాంటి ఇంట్లోకి చేరారు. ఐదారేళ్లు సమస్త సుఖాలూ చవిచూశాక వైభవాలూ అనుభవించాక మొన్నీమధ్యనే శంకర్రావు తల్లి గతించింది. అంతే! అతని తండ్రి కొమ్మలు కొట్టేసిన చెట్టులా ఒంటరిగా బేలగా మారిపోయాడు. ఆ బెంగ పేరు పెరాలిసిస్ అన్నారు డాక్టర్లు. కాలూ చెయ్యీ పూర్తి స్వాధీనంలో లేవు. ఎవరైనా నడిపిస్తే నడవడం తినిపిస్తే తినడం.

చరమాంకం సమీపించిందని తెలుసుకున్నాక తనకున్న ఏకైక స్వార్జితమైన తనూళ్లోని ఇంటి స్థలాన్ని అమ్మేసి కొత్తగా పుట్టిన మనవడికి కానుకివ్వాలని తాపత్రయపడిపోతున్నాడు. శంకర్రావు తండ్రి మాటని ఈ విషయంలో...ఈ సమయంలో ఎదిరించి "పోన్లే నాన్నా" అనలేదు.

"రాత్రి రైలెక్కితే తెల్లారేటప్పటికి రాజమండ్రిలో దిగుతావ్. అక్కణ్ణించి మనూరికి మూడు రూపాయల టిక్కెట్టుతో వెళ్లొచ్చు. గొప్పకోసం...అద్దెకార్లో, ఆటోలో ఎక్కకు. ముప్పై రూపాయలు అడుగుతారు వెధవలు" అంటూ కొడుక్కి మార్గోపదేశం చేశాడు.

నాన్న దగ్గర 'అలాగే' అని బయల్దేరాడు గానీ...హాయిగా కార్లో వెళ్లిపోతే సుఖంగా, సులువుగా ఉంటుందని శంకర్రావు అనుకుని బయల్దేరాడు.

తండ్రి నాటి ఆదాయం బట్టి ఆయన ఆలోచన ఉంటుంది అని నవ్వుకున్నాడు.

"వెళ్లగానే కరణం గార్ని కలు. మునసబుగార్ని కలిసి మాట్లాడు. ఇదిగో ఈ రిజిస్ట్రేషన్ పత్రం చూపించు. ఆ రోజుల్లో...200 రూపాయలకి కొన్నాను. ఇప్పుడు 5వేలు పైనే ధర పలుకుతుంది. ఇలా అమ్మేస్తున్నామంటే వాళ్లే వెల కడతారు. ఓ పాతిక రూపాయలు ఎక్కువ వచ్చేలా చూడమను. ఇలా నువ్వో డాక్టరూ...ఇంత సంపాయిస్తున్నావనీ డాబు చూపించకు. మోసం చేస్తారు ఎవర్నీ నమ్మకు" ఎన్ని డైరెక్షన్స్ ఇచ్చాడో ఎంత జాగ్రత్తలు చెప్పాడో. స్వార్థం కాదది. స్వార్జితం...కష్టార్జితంమీద ప్రేమ అది. ఆ స్థలంలో కొన్నాళ్లు తడక గోడలతో తాటాకు పాక వేసి భార్యతో సొంతింట్లో కాపురం పెట్టాడు. శంకర్రావు అప్పుడు చిన్న పిల్లాడు. ఓ రోజు గాలీవానా వచ్చి పై కప్పు చెల్లా చెదురయింది. ఇంక లాభం లేదని వేరే ఇల్లు అద్దెకు తీసుకుని మకాం మార్చారు. ఆ తర్వాత రోజూ స్కూలుకి వెళ్లేప్పుడు ఓసారి ఆ ఇంటిని చూసుకొని బాగుచేయాలని అనుకొంటూండేవాడు పెద్దాయన. ఖర్చులు ఎప్పటికప్పుడే పెద్దవి. ఈ ఖర్చు వెనకబడిపోయింది.

కొడుకు వృద్ధిలోకి వచ్చేక ఈ స్థలంలో పక్కా ఇల్లు కట్టుకోవాలని ఆశపడ్డాడు. కానీ...వాడితో ఉండాలి అన్న ఆశ జయించింది. ఇవన్నీ శంకర్రావుకి చాలాసార్లు చెప్పాడు తండ్రి.

ఇప్పుడు మనవడికి ఆ స్థలం అమ్మిన డబ్బివ్వాలి. అది ఆయన జీవితాశయం. అది తీర్చడం కొడుకుగా శంకర్రావు బాధ్యత. రాత్రంతా డ్రైవ్ చేసి తెల్లారేప్పటికి తను పుట్టి పెరిగిన ఊరికి చేరుకున్నాడు శంకర్రావు.

తెల్లారింది. ఊరూ చేరువైంది.

ఓ కాకా హోటల్లో ముఖం కడుక్కొని టిఫిన్, కాఫీ సేవించాడు శంకర్రావు. కరణం గారి ఇంటి ఎడ్రస్సు కనుక్కొని వెళ్లాడు. ఆయన ముందు రోజు రాత్రే హైదరాబాద్ వెళ్లాట్ట! మునసబుగారిల్లు వెతుక్కుని వెళ్లాడు. ఆయనా ఊళ్లో లేడు. ఉసూరుమంది శంకర్రావు ప్రాణం. ఈ రోజంతా ఇక్కడే ఉండాలా? రేపెన్నో ఎపాయింట్‌మెంట్స్ ఇచ్చాడు. రెండు ఆపరేషన్లు కూడా ఉన్నాయి. అసలు ఉండాలన్నా ఎక్కడ ఉండాలి? ఈ దగ్గర్లో హోటల్ రూమ్ అయినా దొరుకుతుందా? అగమ్యంగా కారు నడుపుతున్నాడు. ఎవర్నయినా అడుగుదాం. అనుకొంటూండగా...ఓ వ్యక్తి కనిపించాడు.

"ఏవండీ ఒక హోటల్ రూమ్ కావాలి. ఇక్కడికి ఎంత దూరంలో ఉంటుంది?"

**చరమాంకం సమీపించిందని తెలుసుకున్నాక తనకున్న ఏకైక స్వార్జితమైన తనూళ్లోని ఇంటి స్థలాన్ని అమ్మేసి కొత్తగా పుట్టిన మనవడికి కానుకివ్వాలని తాపత్రయపడిపోతున్నాడు. శంకర్రావు తండ్రి మాటని ఈ విషయంలో...ఈ సమయంలో ఎదిరించి "పోన్లే నాన్నా" అనలేదు.**

"ఎవరికి రా? నీకేనా?" అన్నాడు ఆ వ్యక్తి.

శంకర్రావు షాక్ అయ్యాడు.

"ఒరే శంకూ...నేనా..రామాచారిని..."

రామాచారిని పోల్చుకోలేకపోయాడు శంకర్రావు.

"వెధవా! పెద్ద డాక్టరై కార్లో తిరుగుతున్నప్పుడు నన్నెలా గుర్తు పడతావులే"

వంద తిట్లతో శంకర్రావు మీద ప్రేమ వ్యక్తం చేశాక రామాచారి బాగా గుర్తొచ్చాడు శంకర్రావుకి.

రామాచారి ఏడో క్లాసులో తన క్లాస్‌మేట్...సడన్‌గా చదువు ఆపేసి దూరమైపోయాడు. కానీ శంకర్రావుకి...ఎన్ని తరగతులు...ఎన్ని కాలేజీలు... అందులో ఎందరు స్నేహితులు? అతని స్నేహితుల సర్కిల్ విదేశాల దాకా విస్తరించింది.

రామాచారి తిట్టీకొట్టీ మొట్టీ శంకర్రావుని తనింటికి పిలుచుకెళ్లాడు.

అతని తల్లీ, భార్య కొడుకొచ్చినంత సంబరపడి ఆతిథ్యం ఇచ్చారు. రామాచారి తల్లి మంచం మీంచి లేవలేదు. భార్య కడుపుతో ఉంది. అయినా ఎంతో ఓపిగ్గా శంకర్రావుని ఆదరించారు.

కాస్సేపటికి తనొచ్చిన పనీ విషయం వివరించాడు.

రామాచారి చాలా మామూలుగా "స్థలం ఎక్కడా...ఎంతకి అమ్ముదామనుకుంటున్నారు?" అని అడిగాడు.

స్థలం తాలూకు డాక్యుమెంట్స్ చూపించి 1960లో రెండొందలకి కొన్నారట...మరి ఇవ్వాళ రేటెంతుందో నాకు తెలియదు కదా?"

శంకర్రావు నాన్న చెప్పిన ఇన్‌స్ట్రక్షన్స్ అన్నీ ఫాలో అవుతూ సిన్సియర్‌గా చెప్పాడు.

"ఒరే! నువ్విప్పుడు అర్జెంటుగా ఈ స్థలం అమ్మేయ్యాలా?" అన్నాడు కాగితాలు పరిశీలనగా చూసిన రామాచారి.

"మా నాన్న చెప్పాడు. అంతే నాకు తెలుసు. ఎందుకమ్మాలో కూడా చెప్పాడు! నా కొడుకుకి ఆ డబ్బిస్తాట్ట! ఐదు వేలో ఎంతో వస్తుందిట! అది తీసుకోవాలట."

శంకర్రావు ఏంటేంటో చెప్పాడు.


"ఒరే! ఓ రెండు నెలలు ఆగితే కుదరదా!" అన్నాడు కాగితాలు చూస్తూ రామాచారి.

శంకర్రావు అయోమయంగా "నీ మాటలు నాకు అర్థం కావటంలేదురా! రాము!" అన్నాడు.

"నీకు తెలుసా! ఇప్పుడు నువ్వు కూర్చున్న స్థలం మీదే! నువ్వు ఇవ్వాళే ఖాళీ చెయ్యమంటే మాకు ఎక్కడికెళ్లాలో తెలియదు. కొన్నాళ్లు టైమివ్వరా. నీ స్థలంలో మేము వేసుకున్న పాకని తప్పక ఖాళీ చేస్తాం"

రామాచారిని చూసిన శంకరానికి చాలా జాలేసింది. శంకరం "రిజిస్ట్రేషన్ ఎప్పుడు వేయించుకోమంటావో చెప్పు!" అన్నాడు.

"రెండు నెలలు అన్నావు కదా! అప్పో సప్పో చేసి ప్రిపేర్ అవుతా!"



రామాచారి 'లో ప్రొఫైల్‌లో మాట్లాడాడు.

"రిజిస్ట్రేషన్ కోసం, నువ్వేం డబ్బు ప్రిపేరవ్వక్కరలేదు! నీ పేరు మీద రిజిస్ట్రేషను చేయిస్తాను! దయచేసి మా నాన్నకి ఈ సంగతి తెలీనీకు"

* * *

శంకరం నాన్న దగ్గరకెళ్లి అయిదు వేల రూపాయల స్థలాన్ని ఏడు వేల రూపాయలకి అమ్మేసినట్లు నమ్మించాడు. బజానాగా కొనుక్కున్న వాళ్లు ఐదు వేలు అడ్వాన్సు ఇచ్చినట్లు రెండు వేలు రిజిస్ట్రేషన్ నాడు ఇస్తానన్నట్లు చెప్పి నమ్మించాడు. తండ్రి ఐదు వేల రూపాయల్ని మనవడు పేరు మీద ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయమని శంకరానికి ఇచ్చాడు. శంకరం బ్యాంకుకి బయలుదేరాడు... అబద్ధమైనా ప్రియమైన మాట చెప్పినందుకు తృప్తితో.

*